# సింగిల్ పేజీ కథలు

## చెల్లి కావాలి

"మమ్మీ! నాకు చెల్లి కావాలి" అంటూ రవి నిద్రలో ఇంకా కలవరిస్తూనే ఉన్నాడు.

రమ ఉలిక్కిపడి లేచింది. రవి ఒంటిమీద చెయ్యి వేసి చూసింది. ఒళ్లు ఇంకా వేడిగానే ఉంది. లేచి వంటింట్లోకి వెళ్లి గిన్నెతో నీళ్లు, నాప్‌కిన్ పట్టుకు వచ్చింది. నాప్‌కిన్ తడిపి రవి ఒళ్లు తుడవసాగింది.

"మమ్మీ! చెల్లి" అంటూ రవి ఇంకా పలవరిస్తూనే ఉన్నాడు.

వీడికి కొత్తగా చెల్లి పిచ్చి పట్టిందీమధ్య. అస్తమానూ ఆ మాటే వాడి ఫ్రెండ్స్ అందరికీ తమ్ముడో, చెల్లో ఉన్నారట. 'నాకే ఎవ్వరూ లేరని నాకు చెల్లి కావాలని' ఈ మధ్య పేచీ మొదలెట్టాడు.

రవి పుట్టిన వెంటనే "మనకు వీడొక్కడు చాలు...ఈ రోజుల్లో చాలామంది ఒక్కళ్లతోటే సరిపెట్టేసుకుంటున్నారని" వద్దన్నా వినకుండా ఆయన వేసెక్టమీ చేయించేసుకున్నారు. ఇప్పుడేం చేయాలి?

తనకి తోడుగా తమ్ముడో చెల్లో ఉంటే బావుండుననే కోరిక వాడికి ఉన్నట్లుంది. అందుకే "చెల్లి చెల్లి" అంటూ పాట మొదలెట్టాడు. ఇప్పుడు బెంగతో జ్వరం తెచ్చుకున్నాడు. పోనీ ఓ పాపను కంటే? లేదా పెంచుకుంటే? ఈయనను ఒప్పించడమెలా? ఆలోచనలతో రమ తల వేడెక్కిపోతోంది. రవికి కాస్త జ్వరం తగ్గినట్లుంది. గాఢంగా నిద్రపోతున్నాడు. రమ మనసు స్థిమితపడింది. హమ్మయ్య గండం గడిచిందని దేవుడికి దణ్ణం పెట్టుకుంది. నెమ్మదిగా రమ కూడా నిద్రలోకి జారుకుంది.


* * *

ఉదయమే రవిని తీసుకుని హాస్పిటల్‌కి వచ్చింది రమ. హాస్పిటల్ బైట జనం గుమికూడి ఉన్నారు. ఆ జనం మధ్య ఓ రెండేళ్ల పాప బిక్కమొహంతో నుంచుని ఉంది. "అమ్మ" అంటూ అటూ ఇటూ చూస్తూ మధ్య మధ్య ఏడుస్తోంది. ఇంకా మాటలు రావనుకుంటా. ఎవరు పలకరించినా "అమ్మా" అని మాత్రమే అంటోంది. బొద్దుగా ముద్దొస్తోంది పాప. "పాపం పాప వాళ్లమ్మ నాన్న ఎయిడ్స్ వచ్చి చనిపోయారట. వాళ్ల వాళ్లెవ్వరూ ఈ పాపను తీసుకెళ్లలేదు" అని అంతా చెప్పుకుంటున్నారు.

రవి అటూ ఇటూ తిరుగుతూ పాపను చూసి వచ్చాడు.

"మమ్మీ! పాపం ఆ పాపకు అమ్మ లేదట. ఆ పాప వాళ్లమ్మ కోసం ఎలా ఏడుస్తుందో చూడు. మనం ఆ పాపను మనింటికి తీసుకుపోదాం మమ్మీ" అంటూ రవి పేచీ మొదలుపెట్టాడు.

"అమ్మో ఇంకేమైనా ఉందా... ఆ పాపకూ ఎయిడ్స్ ఉండే ఉంటుంది" ఆ ఆలోచనకే రమ హడిలిపోయింది. "డాడీ ఒప్పుకోరమ్మా రవీ... నీకు చెల్లిని నేను తెచ్చిస్తాగా ఈ పాప మాత్రం వద్దని" రవిని బుజ్జగించింది.



* * *

భర్త టూర్ నుంచి రాగానే రవి బెంగతో జ్వరం తెచ్చుకోవడం, హాస్పిటల్‌లో పాపను చూసి పేచీపెట్టడం అన్నీ ఏకరువు పెట్టింది రమ. మొత్తానికి ఎలాగైతేనేం భర్తను రీకెనలైజ్ ఆపరేషన్‌కి ఒప్పించింది రమ.

ఇంకో బిడ్డ కావాలన్న కోరిక రమకూ ఎంతగానో ఉంది. బోల్డంత ఆస్తి ఉండీ ఆ రోజు త్వరపడి వేసెక్టమీ చేయించేసుకున్నారని రమకూ భర్తమీద కోపం వస్తుంటుంది అప్పుడప్పుడు. పోన్లే ఇది సక్సస్ అయితే రవి కోరికా, నా కోరికా తీరతాయని కొండంత ఆశతో ఉంది రమ.

* * *

ఆ రోజు సాయంత్రం ఆపరేషన్‌కి డాక్టరు దగ్గర అపాయింట్‌మెంట్ తీసుకున్నాడు చరణ్. ఆఫీసు నుంచి కారులో ఇంటికి వస్తుండగా భారీ వర్షం మొదలైంది. దారిలో ఒక చోట వర్షంలో తడుస్తూ తల్లికోసం వెతుక్కుంటూ తిరుగుతున్న చిన్న కుక్కపిల్ల కనిపించింది. దాన్ని చూడగానే జాలి వేసింది చరణ్‌కి. రవి గుర్తుకు వచ్చాడు ఆ సమయంలో. వాడి కోసమైనా దాన్ని ఇంటికి తీసుకువెళదామనిపించింది అతనికి. వెంటనే దాన్ని తీసుకుని కారు స్టార్ట్ చేశాడు.

తండ్రి చేతిలో కుక్కపిల్లని చూసి ఎగిరి గంతేశాడు రవి. దానికి శుభ్రంగా స్నానం చేయించి ఒళ్లు తుడిచాడు. పాలు పట్టించి, దుప్పటి కప్పాడు.

ఆ కుక్క పిల్ల ఎక్కడ కనిపించిందో దాని పరిస్థితి ఏమిటో రమకు వివరంగా చెబుతున్నాడు చరణ్.

రవి వచ్చి తండ్రిని కౌగిలించుకొని ముద్దు పెట్టాడు. "మమ్మీ! డాడీ ఎంత మంచివారో చూశావా? కుక్కపిల్ల ఏడుస్తుంటే చూడలేక ఇంటికి తీసుకువచ్చారు. మరి నువ్వో? ఆరోజు హాస్పిటల్‌లో ఆ పాప వాళ్లమ్మ చచ్చిపోయి ఏడుస్తున్నా ఆ పాపను మనింటికి తీసుకువెళదామని నేను అడిగినా సరే...నువ్వు ఒప్పుకోలేదు. నువ్వు బాడ్ మమ్మీవి. అదే డాడీ అయితేనా! ఆ పాపను అలా వదిలి వచ్చేవారే కాదు. నాకు తెచ్చిచ్చే వారు. అవునుకదా డాడీ?" అంటూ రవి మాట్లాడేసరికి చరణ్, రమ స్థాణువులైపోయారు.

కుక్కపిల్లపై చూపించిన జాలి ఓ చిన్న పాపపై చూపలేకపోయారన్నట్లుగా రవి ప్రశ్నించినట్లనిపించింది ఇద్దరికీ. రవికి వచ్చిన ఆలోచన తమకు రానందుకు ఇద్దరూ పశ్చాత్తాపపడ్డారు.

వెంటనే చరణ్ ఆ పాప గురించి ఎంక్వయిరీ చేసి తెలుసుకున్నాడు. ఆ పాప ఉన్న అనాథాశ్రమానికి రవిని, రమను తీసుకెళ్లాడు. ఫార్మాలిటీస్ అన్నీ పూర్తయ్యాయి. రమ లోనికి వెళ్లి పాపను ఎత్తుకు వచ్చింది.

"రవీ! చెల్లి కావాలన్నావుగా...ఇదిగో చెల్లి" అని పాపను అందించింది. రవి ముఖం ఆనందంతో వెలిగిపోతోంది.

రవి పాపను ఎత్తుకుని ముద్దుపెట్టుకున్నాడు. "మమ్మీ! యు ఆల్సో వెరీ గుడ్" అన్నాడు సంతోషంగా.

ఓ అనాథ పాపను ఆదుకున్నామన్న ఆనందం ఆ దంపతుల కళ్లల్లో కనిపిస్తోంది.

-ఎన్.ఇందిరా నాగేశ్వర్ (మైలవరం)